క్లుప్తంగా

తొండపిలో 'నేను బడికి పోతా' కార్యక్రమం



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, పిల్లల భద్రత బడిలోనే ఉంటుందని, ప్రతి పిల్లవాడు బడిలోనే ఉండాలంటూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలు, వసతులను వివరిస్తూ బడిలో చేర్పించాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనులకు పంపించరాదని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.ఆదిలక్ష్మి, జేవీ రమణారావు, జి.భానుప్రకాష్, షేక్ బాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్‌లు పంపిణీ



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామ ఎంపీపీ(రామాపురంకాలనీ) పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు మొవ్వ సురేష్, కళ్యాణి, వేణుమాధవి, సతీష్‌లు పాల్గొన్నారు.

చేజర్లలో...



నకరికల్లు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టూడెంట్ కిట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహిం అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టూడెంట్ కిట్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలు, సమదుస్తులు, బ్యాగ్ తదితర వస్తువులతో కూడిన కిట్ పంపిణీ చేసినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేరా మోహన్‌రావు, ఎస్.లలిత, షేక్.మస్తాన్‌వలి, ఏసీహెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

ప్రిన్సిపాల్ కె.పాపయ్య



జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం సమీపంలో నున్న ఏపీ మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో నున్న ఖాళీల ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు (ఆఫ్‌లైన్) స్కూల్‌లోనే దరఖాస్తు పూర్తిచేసి ఇవ్వాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో నున్న ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 6వ తరగతిలో 30 ఖాళీలు, 7వ తరగతిలో 32 ఖాళీలు, 8వ తరగతిలో 33, 9వ తరగతిలో 28, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 20, సెకండ్ ఇయర్‌లో 31 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోనే బోధన ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ నంబర్ 9182958496ను సంప్రదించాలని తెలిపారు.

అన్నదానం, మజ్జిగ పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): భగవాన్ రామదూత స్వామి పుట్టిన రోజు, షష్టిపూర్తి సందర్భంగా స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే కూరగాయల మార్కెట్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమ్ములదిన్నె ఆంజనేయులు, సామ్రాజ్యం, విజయేంద్ర, రమేష్ బాబు, ఆర్మీ చినవెంకన్న, ఆంజనేయులు, కోటయ్య పాల్గొన్నారు.

వానా కాలం.. పిడుగుల కాలం

- పొలాలు, చెట్ల కింద ఉన్న వారిపై పడుతున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణుల సూచన
- ఎత్తైన కట్టడాలకు లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి



సత్తెనపల్లి: వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఉరుములతో కూడిన వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందని ముందస్తుగా రాష్ట్ర విపత్తు, నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. ఏ ప్రాంతంలో పిడుగులు పడతాయో ముందుగానే ఆ ప్రాంతంలో గల సెల్‌ఫోన్‌లకు విపత్తు నిర్వహణ శాఖ వారు మెసేజ్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడుతుంటాయి. పిడుగు పాటు వల్ల విడుదలయ్యే పెద్ద పెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి వస్తుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని ఏర్పాటు చేసుకోవడం వలన పిడుగులో ఉన్న విద్యుదావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తైన కట్టడాలకు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

జాగ్రత్తలు పాటించాలి

మెరుపులు, ఉరుములు వచ్చే సమయంలో చెవులు గట్టిగా మూసుకోవాలి. పిడుగు శబ్దంతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకపోతే నేల మీదకు పూర్తిగా కిందకు వంగాలి. నేలపై పడుకోకూడదు. నేలపై కూర్చున్నప్పుడు పాదాలు ముందు భాగం మాత్రమే నేలను తాకాలి. శరీరంలోని మరే ఇతర భాగం నేలను తాకకుండా చూసుకోవాలి. పాదాల మడమల ముందు ఒకదానిని ఒకటి తాకేలా ఉండాలి. అలా చేయడం వల్ల పిడుగు పడే సమయంలో నేలపై పడి దాని విద్యుత్ శక్తి ఒక పాదం నుంచి శరీరంలోకి ప్రవహించిన వెంటనే రెండో పాదం నుంచి తిరిగి భూమిలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి విద్యుత్ ప్రవహించే అవకాశాలు తగ్గుతాయి.



2023 మే 20న సత్తెనపల్లి రఘురామ్‌నగర్‌లో పడిన పిడుగుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు

ఇళ్లకు విద్యుత్ ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి

- మేఘాలు దట్టంగా కమ్ముకున్నప్పుడు పిడుగులు పడతాయనే ఆలోచనకు రావాలి.
- కళ్లు మూసుకోవడం వల్ల ప్రసార కాంతి నుంచి తప్పించుకోవచ్చు. భూమిపై ఉన్న ఎలాంటి లోహాలను తాకకూడదు.
- పొలాల్లో ఆరుబయట ఉన్నప్పుడు చెట్ల కిందికి వెళ్లకూడదు. ఎత్తైన చెట్లు, స్తంభాలు పిడుగులను ఆకర్షిస్తాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ నెలలో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు క్యుములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వర్షం వస్తున్నట్లు ముందే తెలుస్తుంది కాబట్టి వీలైనంత వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏం చేయకూడదు?

- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడరాదు.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో రైతులు పొలాల్లో ఉండకూడదు.
- పెద్ద మెరుపు కనిపించిన తర్వాత 30 నిమిషాల వరకు బయటకు వెళ్లకూడదు.
- ముఖ్యంగా ఆ సమయంలో సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. లేదంటే రేడియేషన్ తరంగాలకు గురయ్యే ప్రమాదం ఉంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కింద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరగా ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో భయాందోళనకు గురయ్యే ఆస్కారం ఉంది. ధైర్యంగా ఉండాలి.

ప్రథమ చికిత్స ఇలా...

- పిడుగుపాటుతో అస్వస్థతకు గురైన వారిని వెంటనే గాలి, వెలుతురు తగిలే విశాలమైన ప్రాంతంలో ఉంచాలి.
- తడి దుస్తులు తొలగించి పొడి దుస్తులు వేయాలి.
- తిన్నగా పడుకోబెట్టి రెండు కాళ్లు పైకి ఎత్తి ఉంచాలి.
- తలను ఒక వైపు తిప్పి పెట్టాలి.
- ఆ సమయంలో నోటి ద్వారా నీరు, ఇతర ఎలాంటి ఆహారాన్ని అందించకూడదు.
- వెంటనే అందుబాటులో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలి.

మురుగు ప్రవాహానికి ఆటంకాలు



పట్టణంలోని మార్కెట్ సమీపంలో మురుగు కాలువ



ఎఫ్‌సీఐ పక్కన చెత్తతో మూసుకుపోయిన మురుగు కాలువ

సత్తెనపల్లి: పట్టణంలోని పలు వార్డుల్లో శిథిలమైన డ్రైనేజీలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. దీంతో పాటు కొన్ని డ్రైనేజీలు ఆక్రమణలకు గురి కావడంతో మురుగునీటి ప్రవాహానికి తరచూ ఆటంకం కలుగుతుంది. చెత్త అడ్డం పడినప్పుడు మురుగునీరు డ్రైనేజీలను ఆనుకొని ఉన్న ఇళ్లల్లోకి ప్రవేశిస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షం కురిస్తే మాత్రం డ్రైనేజీలను ఆనుకొని నివసిస్తున్న కుటుంబాలకు కంటి మీద కునుకు ఉండని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారుల్లో సైతం మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో వర్షం కురిస్తే రోడ్లన్నీ తటాకంలా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేని విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు

ఏడీఏ కృష్ణదేవరాయలు

అచ్చంపేట: అనుమతి పత్రాలు లేని విత్తనాలు, అలాగే లూజులో విత్తనాలు విక్రయించినా లైసెన్సులు రద్దు చేస్తామని పిడుగురాళ్ల వ్యవసాయ సహాయ సంచాలకులు బి.కృష్ణదేవరాయలు విత్తన వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని విత్తన షాపులలో ఏవో వెంకటేశ్వర్లుతో కలసి ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ బోర్డులను, ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్లను, విత్తన కంపెనీలకు సంబంధించిన పత్రాలను, ప్రభుత్వం నుంచి పొందిన విత్తన అనుమతి పత్రాలను పరిశీలించారు. స్థానిక శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, తిరుమల ట్రేడర్స్, శ్రీరామసీడ్స్, శ్రీపుల్లారెడ్డి సీడ్స్ తదితర దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఆ బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి లాట్‌కు శాంపిల్స్ తీసి టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. వ్యాపారులు లూజు విత్తనాలను విక్రయించడం నేరమన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు రైతుల నుంచి ఫిర్యాదులందితే వ్యాపారులదే పూర్తి బాధ్యతన్నారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డులను ఉంచుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలని చెప్పారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, విత్తన డీలర్లు ఉన్నారు.



క్రోసూరులోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ కృష్ణదేవరాయలు, ఏవో వేణుగోపాల్

విత్తన డీలర్లు ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి

క్రోసూరు: విత్తన డీలర్లు తప్పనిసరిగా ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ పొంది ఉండాలని పిడుగురాళ్ల ఏడీఏ బి.కృష్ణదేవరాయలు అన్నారు. మంగళవారం క్రోసూరులోని పలు విత్తన దుకాణాలను క్రోసూరు ఏవో వేణుగోపాల్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ డీలర్లకు పలు సూచనలు చేశారు. విత్తనాల డీలర్లు తాము తెచ్చుకున్న విత్తనాలకు ఉత్పత్తి దారు నుంచి ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. అలా సర్టిఫికెట్ పొందకుండా ఉంటే విత్తనాల విక్రయాలు నిలిపి వేసి సదరు డీలరుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా విత్తన డీలర్లు విత్తనాల రకాలు, ధరలు సూచిక బోర్డు తప్పనిసరిగా పెట్టాలన్నారు. విక్రయించిన విత్తనాలకు సంబంధించి లాట్ నంబర్, బ్యాచ్ నంబర్, గడువు తేదీ బిల్లుపై రాసి రైతు సంతకం లేదా వేలిముద్ర తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. రైతు అడిగిన విత్తనాలు మాత్రమే ఇవ్వాలని, వారిని మభ్యపెట్టి తమ దగ్గర ఉన్న విత్తనాలు విక్రయించకూడదని అన్నారు. అలాగే విత్తనాలను అధిక ధరలకు విక్రయించకూడదన్నారు. పై విధంగా విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలని లేకుంటే 1966 విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం

సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి మొఘల్ సుభాన్ బేగ్

అచ్చంపేట: అన్ని రకాల వ్యాధులు దోమలు, కలుషిత నీరు తాగడం వలన వస్తాయని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి మొఘల్ సుభాన్ బేగ్ అన్నారు. మలేరియా నిర్మూలన మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, బీసీ బాలికల వసతిగృహం, ఎస్టీ బాలుర వసతి గృహాలలో ఆయన మలాతియన్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వసతి గృహాలలో మురుగు చేరకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు చెప్పారు. దోమల నిర్మూలనకు మలాతియన్ ద్రావణాన్ని పరిసరాలలో స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభమైనందున కుళాయిల వద్ద, తిన్న ప్లేట్లు కడుక్కునే ప్రదేశంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పంచాయతీ సహాయంతో రెండు మూడు రోజులకొకసారి బ్లీచింగ్ చల్లుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజేష్, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, రాధాకృష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, బాలికల పాఠశాల స్పెషల్ అధికారి జ్యోత్స్న దీప్తి, వార్డెన్స్ శైలజ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డుల జారీపై సమీక్ష



క్రోసూరు: క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో కౌలు గుర్తింపు కార్డుల జారీపై ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డుల జారీపై తీసుకోవాల్సిన విధి విధానాలను ఏవో వివరించారు. బుధవారం రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, తహసీల్దార్ ఎం.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తా

సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళల సమస్యలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదికలో మంగళవారం సత్తెనపల్లి రూరల్ మండలానికి చెందిన డ్వాక్రా, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్వాక్రా, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

భారీగా పెరిగిన కూరగాయల ధరలు

- స్థానికంగా తగ్గిన ఉత్పత్తి
- సరఫరా కూడా అంతంత మాత్రమే

సత్తెనపల్లి: కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రత, నీటి లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడం వంటి కారణాలతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. రవాణా, ఇతర చార్జీలు, కొరత వంటి కారణాలతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాటా, బెండ, దొండ, వంకాయలు, పచ్చిమిర్చి, బీరకాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. డిమాండ్‌కు అనుగుణంగా సరుకు దిగుమతి కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అందుబాటులో ఉన్న ధరలు ఇప్పుడు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చుట్టుపక్కల గ్రామాల నుంచి దిగుమతి

కూరగాయల సాగు స్థానికంగా తగ్గడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సత్తెనపల్లి పట్టణానికి కూరగాయలు ఎక్కువగా చుట్టుపక్కల 67 గ్రామాల నుంచి వస్తుంటాయి. ఇక్కడ నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తక్కువ మొత్తంలో వస్తుంటాయి.

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంటల సాగుకు అవసరమైన మొత్తంలో నీటి లభ్యత లేకపోవడంతో పలువురు రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. దీంతో బహిరంగ మార్కెట్‌కు దొండ, వంగ, బెండ తదితర ఉత్పత్తులు కొద్ది మొత్తంలో మాత్రమే వస్తున్నాయి. దీంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.



కూరగాయలు



పచ్చిమిర్చి

బయట నుంచి సరఫరా

టమాటా, బీర, క్యాప్సికం, కాకర ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి టమాటాలు, బీరకాయలు, కాలీఫ్లవర్, క్యాప్సికం, బీన్స్ వంటివి సరఫరా అవుతున్నాయి. స్థానికంగా సాగు లేకపోవడంతో ఆ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రైతులు చెల్లించే దానికి మధ్యవర్తులు, రవాణా చార్జీలు తోడవడంతో ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. అలాగే పచ్చిమిర్చిని పులివెందుల, బద్వేలు, బాపట్ల, గిద్దలూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

సత్తెనపల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లో ధరలు ఇలా... (కిలో రూపాయలలో)

కూరగాయలు	మార్చి	మే	జూన్
టమాటా	25.00	50.00	80.00
వంకాయలు	40.00	60.00	70.00
బంగాళాదుంపలు	30.00	40.00	50.00
బీరకాయలు	40.00	60.00	70.00
క్యాప్సికం	80.00	100.00	120.00
కాకరకాయలు	40.00	60.00	80.00
దొండకాయలు	30.00	40.00	50.00
సొరకాయ	15.00	25.00	30.00
గోరుచిక్కుడు	40.00	60.00	60.00
క్యాబేజి	30.00	40.00	40.00
క్యారెట్	50.00	60.00	60.00
పచ్చిమిర్చి	60.00	100.00	60.00

23 వేల పాఠ్యపుస్తకాలు అందజేత

ఎంఈవో-2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు రెండు విడతలుగా 23 వేల పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు ఎంఈవో-2 వై.శివనాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వివిధ గ్రామాలలో ఉన్న మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మూడు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, 22 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న 3,862 మంది విద్యార్థులకు మొత్తం 32 వేల అచ్చు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 7వ తరగతి అచ్చు పుస్తకాలు రాలేదని మిగిలిన తరగతులకు సంబంధించి కొన్ని పాఠ్యపుస్తకాలు రావలసి ఉందని రెండు, మూడు రోజుల్లో మిగిలిన అచ్చుపుస్తకాలు రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నారు. 124 మంది ఉపాధ్యాయులకు గాను 100 మంది ఉపాధ్యాయులు ఉన్నారని మరో 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయని త్వరలో ఆ పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో కార్యాలయ సిబ్బంది

గొంతువాపు నివారణకు ఉచిత టీకా

శావల్యాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ సారథ్యంలో పశువులకు గొంతు వాపు నివారణకు ఉచితంగా టీకా వేస్తున్నట్లు కారుమంచి సెక్టారు పశువైద్యాధికారి సోముల గుణధీర్ మంగళవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సుమారు 6 వేల పశువులు ఉండగా ఇప్పటి వరకు 2,500 పశువులకు టీకా చేసినట్లు ఆయన చెప్పారు. దూడలు, పడ్డలకు మాత్రమే గొంతు వాపు వ్యాధి వస్తుందని, వర్షాకాలంలో పచ్చగా మొలిచిన గడ్డి, మెత్తటి మట్టి రెండు తినటం వలన ఈ వ్యాధి సోకుతుందన్నారు. కొత్తనీరు తాగటం వలన గురక (గొంతువాపు) వ్యాధి వస్తుందన్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో గొంతు వాపు వ్యాధి అధికంగా ప్రబలతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గొంతు వాపు టీకాలు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పర్యవేక్షణలో వేయడం జరుగుతుందన్నారు. సకాలంలో చికిత్స అందకపోతే పశువులు మృత్యువాత పడతాయన్నారు. పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: కామ్రేడ్ పున్నారావు 17వ సంస్మరణ సందర్భంగా జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాలను మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పీడీఎం, ఎం సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ గుంటూరు బ్రాడీపేట 2/7లో కొరిటాల భవనం(సీపీఎం పార్టీ కార్యాలయం)లో ఉదయం 10.30 గంటలకు సంస్మరణ సభ ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి వక్తలుగా విరసం పాణి, డేవిడ్, చిలుక చంద్రశేఖర్, వైవీలు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ సంపదలు కాపాడాలని దేశ ప్రజలు పోరాడుతున్నారని, ముఖ్యంగా మధ్య భాగంలో ఆదివాసీలు వనరుల దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎం సీపీఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్, ఎం సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎం, ఎం సీపీఐ నాయకులు

గ్రామాల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమం



దాచేపల్లి : నగర పంచాయతీతో పాటు గ్రామాల్లోనూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత విద్యను ప్రతి ఒక్కరు అందుకోవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అక్కడికక్కడే చిన్నారులకు అడ్మిషన్ రాసి బడిలో చేర్చుకుంటున్నారు. పిల్లలను బడికి పంపించకుండా పనికి పంపిస్తే ప్రభుత్వం తీసుకునే చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు నాగెండ్ల ఏసయ్య, చెట్టిపోగు ఏసురత్నం, వట్టెపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.